# కరువు

'రోహిణీకార్తెలో వాన పడ్డప్పుడే అనుకున్నాను... ఈ సంవత్సరం రైతు నోట్లో మట్టిపడేట్టే వుందని... కాలమంత ఎటమటంగానే అవుతుందని... ఎదురు వానకాలాన్ని ముంచుతుందని... ' ఆకాశం దిక్కు ఆశగా చూస్తూ తనలో తాననుకున్నాడు రాజిరెడ్డి. ఎక్కడా ఒక్క మబ్బుముక్కా కనపడలేదాతనికి.

'నడివానాకాలంలో నిల్చొని ఎండలు కొట్టడం నేనెప్పుడూ చూల్లేదు... ఇంత పాపపు కాలమస్తుందనుకోలేదు...' గొణుక్కున్నట్టనుకుంటూ చేలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఎండి వాడిపోతున్న మొక్కలను చూస్తుంటే రాజిరెడ్డి కడుపు చెరువవుతోంది.

అరుపదుల జీవితానుభవాలే కాలాన్ని చూస్తుంటే కళ్ళవెంట నీళ్ళు తెప్పిస్తున్నాయి.

రోహిణ్లో పడ్డ వానకే సాలు వస్తుందని పెసల్లు, మొక్కలు భూమిపాలు చేశారు... ప్రియమైన ధరకు పల్లీలు కొని విత్తనాలేశారు.

మృగశిర చొచ్చిన రోజున ఉరుము వినబడ్తుందని చెవులప్పలించి విన్నారు... ఒక్క చినుకైనా పడ్తుందని చకోరపక్షుల్లా ఎదురుచూశారు...నిరాశే ఎదురైంది. మృగశిర పోయింది...అరుద్ర పోయింది... పెద్ద పూసాల (పునర్వసు), చిన్న పూసాల (పుష్యమి) పోయాయి. భూమి తడిసే వానొక్కటీ పల్లేదు...

నెలలకు నెలలు చినుక్కూడా పడకుంటే ఎలా...? అశ్రేషకార్తొచ్చింది. అసలేట్లో ముసలెడ్లుకూడా రంకెలేత్తాయంటరు... మేయడానికి పచ్చిగడ్డి మొక్కే లేకుంటె ఏం తిని రంకెలేస్తాయి...?

ఇంత దుర్దెశ కాలమెప్పుడూ చూల్లేదు. గొణుక్కుంటున్నాడు రాజిరెడ్డి... ఎండిపోతున్న మొక్కలను చూస్తుంటే భోరుభోరున ఏడ్వాలనిపిస్తోంది.

మొగులు దిక్కు చూశాడు రాజిరెడ్డి.

ఒక్క మబ్బు తునకా కనబడలేదు.

మఖకార్తె వచ్చింది...మఖంతా ఉరుములు, మెరుపులతోనే ఉండాలి... ఎక్కడా ఒక్క ఉరుమూ లేదు... మెరుపూ లేదు...

పెసరుమొక్కలు మాడి మసయిపోయాయి. ఎంతో పిరియంగ కొని విత్తనాలేసిన పల్లి భూంపాలే అయ్యింది... మొక్కజొన్న పంట గతీ అంతే అయింది. పునాస పంటంతా నాశనమైపోయింది.

పుబ్బకార్తె కూడా పోతుంది. ఇంకిప్పుడు వానలు పడ్డా ఏం లాభం...? ఇంత ఎండలు కొడ్తుంటె వరి మాత్రం పండుతుందా? ఏ కాలంలో ఉండాల్సిన వాతావరణమా కాలంలో ఉంటే మంచిది.

పోచంపాడు కాలువ పుణ్యమా అని చెర్లున్న కొంచెం నీల్లతోని కొన్ని నార్లు మా ఏసింద్రు... ఈ ఎండలకు బూడిదరోగా లొస్తున్నయి. వరి బొంగు లెడుతుంది... ఈ పసలు వరిపంట కూడా నాశనమైనట్టే... శ్రీరామ్‌సాగర్‌లకు నీళ్ళొస్తె వేసంగి పంట పండుద్దేమొ...? వానకాలం చివరకు రావట్టె...నీళ్ళెప్పుడు రావాలె... మనకెప్పుడిడువాలె...?

ఎర్రబడి వాడిపోయినట్లున్న వరిమొక్కలను చూస్తూ గొణుక్కుంటున్నాడు రాజిరెడ్డి.

ఈ యేడు కరువు తప్పది. బియ్యం ధర ఘోరంగా పెరుగుతది. బియ్యం ధర పెరుగుతె ఏదో విధంగా రైతు లాభపడాలి. కాని, అలా జరుగదు. వడ్ల ధరకు, బియ్యం ధరకు, పొంతనే ఉండదు. వడ్లు, ధాన్యం రైతు చేతుల్నుంచి పోయింతర్వాత ధర పెరుగుతది. ఈ మాయేంటో తనలాంటివాళ్ళ కర్థంగాదు.

ఏదేమైనా తాను నేలనే నమ్ముకొని బతుకుతున్నాడు. భూమి మోసం చేస్తదంటాడు తన కొడుకు. కాని, భూమసలే మోసం చేయదని నమ్ముతాడు తాను. మోసం చేసేదల్లా మనిషే... మనిషే!

రెండు మూడుసార్లనుకున్నాడు రాజిరెడ్డి. పొలంలో గట్లవెంట నడుస్తూ తేపకోసారి అకాశం దిక్కు చూస్తున్నాడు. మొక్కలను చూస్తుంటే రాజిరెడ్డి కడుపు, తరుక్కుపోతుంది.

రైతేమో బాముకుంటున్నాడని ఎరువుల మీద, కరెంటు మీద సబ్సిడి తీసేత్తరట. మరి మేం పండించిన పంటకు మా ఇష్టమున్న ధరపెడితే ఊకుంటారా?

కరెంటే సరిగా రాదు... పడిగాపులు కాసి-కాసి కరెంటొచ్చినపుడు పెడుదామంటె బావుల్లో నీల్లుండయి... పాతాళం లోతులున్న నీటిబొట్లను పంపుగుంజది... చుక్కబొట్లోలె పడితె పొలమేడ పారుతది? వానలేమొ ఇట్ల చేయవట్టె!

తప్పదిగ... ఘోరమైన కరువు తప్పది.

కీలకనామ సంవత్సరంల వచ్చింది పాడు కరువు. అప్పుడు తాను నడీడులున్నడు.

తన కొడుకు చదువుకుంటున్నడు.

అప్పుడు కొడుకు, తను కలిసి ఏతం బోసింద్రు. మోట గొట్టింద్రు. పెద్దరాత్రి పోయి పొద్దెక్కె వరకు ఏతం బోసినా చాపెలుపు భూమున్న తడువకపోవు. ఏంకష్టపడ్డరు తామప్పుడు? అరఘోషపడ్డరు. అప్పుడు రొండుపూటల గడుకే తిన్నరు తమింట్ల...!

పోసుక తాగుటానికి కూడా ఏం లేకుండె...

ఆ కరువు, ఆ గోస ఎవ్వలకు రావద్దు. ఇప్పుడెంత లేనోడైనా మొక్కజొన్న గడుకేం తింటలేరు. కానిప్పుడు అంతకంటె ఘోరమైన కరువచ్చెటట్టుంది.

అన్నలు... అన్నలంటరు... వాళ్ళకు కూలోల్లు, పాలేర్లే కావాలె... మాలాంటి రైతుల సంగతొద్దు. .. రైతన్నట్టే కాని కూలోల్లకంటె ఏం మంచిగుంది నాలాంటోల్ల బతుకు...? పాలేరు జీతం కూడా పడతందా మాకు...?

తప్పది...ఏ యేడు ఘోరమైన కరువు తప్పది. భుజం మీదినుంచి జారుపోతున్న పంచెను సరిజేసుకున్నాడు. ఆశగా ఆకాశం దిక్కు చూసాడు. దూరాన మబ్బు వస్తున్నట్టుగుపడుతుంది. కాని, వెంటనే దూది పింజల్లా తేలిపోతున్నాయి.

'ఇంత భట్టుకాలం నేనెప్పుడు చూల్లేదు...' లోలోపలనుకుంటున్నట్టుగానే పైకనేసాడు రాజిరెడ్డి.

"ఏం రాజిరెడ్డి పటేలా! చేల్లో, పొలంలో తిరుగుతున్నావు బాగా... ఎవ్వరినో తిడ్తున్నట్టున్నవేంది...?" రాజిరెడ్డి దగ్గరకొచ్చి నిల్చుంటూ అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు గుంటూరి ప్రాంతానికి చెందినవాడు. మూడు నాలుగేళ్ళ క్రితం భార్యా పిల్లలతో సహా ఆ ఊరికొచ్చాడు. అక్కడే భూమిని కౌలుకు తీసుకొని పత్తి పండిస్తున్నాడు. అతన్ని చూసే ఆ ఊరివాళ్ళిప్పుడు తమ చేలలో పత్తి వేస్తున్నారు.

తనను పటేలని ఎవరు పిలిచినా రాజిరెడ్డికెందుకో దెప్పినట్టనిపిస్తుంది.

సుబ్బారావు తన సహజధోరణిలోనే పిలిచినా రాజిరెడ్డికి దెప్పినట్టే అనిపించింది.

"పటేలని కారెడ్డమాడ వడ్తివేంది సుబ్బారావు... నేనేం పటేలును...?" అన్నాడు రాజిరెడ్డి.

"నీ పేరు రాజిరెడ్డాయె... నీ కొడుకు పేరు కృష్ణారెడ్డికద...! నీ కొడుకు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. నిన్ను పటేలని పిలిస్తె తప్పేంటి...?" అన్నాడు సుబ్బారావు.

"తవుడు బుక్కే తాసీల్దారుకు, మీసాల్లేపే మాలూాకు దారన్నట్టుంది సంగతి. ఇంటిపేరు కస్తూరోల్లేకాని ఇంట్ల గబ్బిలాల వాసనంటరు సూడు, గట్లుంది నా సంగతి. నా కొడుకాఫీసరయితె కావచ్చు... కాని, నేను ఎద్దు ముడ్డి పొడ్సుకుంట బతికే రైతునేకద... కాపు బలిస్తె రెడ్డయితడంటరు... కాని మా నాయిన్న బక్కరైతే అయినా నా పేరెందుకో రాజిరెడ్డని పెట్టిండు. మా నాయిన్న పేరు లింగయ్యే... నేను వ్యవసాయంతోని మట్లె మట్టయే బతుకుతున్న."

"నువ్వన్న మాట నిజమే రాజిరెడ్డీ...! పటేలని పిలిస్తే గౌరవంగుంటుందని పిలిచాను... నీకిష్టం లేకుంటే అలా ఏం పిలువ..." అని "పొలంలో నిల్చొని వానకోసం ఎదిరిచూస్తే వస్తదా వాన...? పోదాం పద ఇంటికి..." అన్నాడు సుబ్బారావు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ ఊరిదిక్కు నడుస్తున్నారు.

"సరెగని సుబ్బారావు... మీ దిక్కు ఎకురానికి పుట్లకొద్ది పండే మంచి భూములుంటయంటరు గద...! గంత మంచి భూములిడ్సిపెట్టి మా బొగ్గుడాల బొగుడకెందుకచ్చినవు...?" అన్నాడు రాజిరెడ్డి.

ఆ మాటలకు సుబ్బారావు ముఖం చిన్నబోయినట్టయింది.

"మా దిక్కున్న భూములు మంచియన్నయాట నిజమే... అంతమాత్రాన

అందరూ బాగానే బతుకుతున్నారనుకోవడం పొరబాటు. నే నక్కడ బాగానే బతుకుతుంటే ఇక్కడికెందుకొస్తా చెప్పు...?"

"అక్కడ ఒక్కొక్కురం అమ్మితే వచ్చిన పైసల్తోని ఇక్కడ పదెకురాలు కొనచ్చని...?"

"అలా చేసి వాళ్ళ భూముల్లో వాళ్ళనే పాలేర్లుగా మార్చినవాళ్ళూ కొందరున్నమాట నిజమే... కాని, నేనొచ్చింది మాత్రం బతుకుదామనే... మా ప్రాంతం అభివృద్ధి చెందిందన్న మాట నిజమే. అట్లని అందరూ బాగానే బతుకుతున్నారనుకోవద్దు. వెనుక గోతులు తీసే మనస్తత్వాలు, వ్యాపార నాగరికత, పోటీకి తట్టుకోలేకనే నేనిక్కడికి వచ్చాను... మీకున్న ఆత్మీయత, ప్రేమగుణం, దాచుకోకుండా ముఖం మీద చెప్పే అలవాటు నాకు బాగా నచ్చాయి..."

"ఇక్కడ కూడ అన్నీ మొదలవుతున్నయి సుబ్బారావు... ప్రేమలు లేకుంటయి తున్నయి. ఒకప్పుడు ఇంటికి చుట్టమస్తే ఎంతో ప్రేమగ చూసేవారు... ఇప్పుడది తగ్గుతోంది..."

పచ్చగా నిగనిగలాడుతూ హరితవనంలా ఉండాల్సిన భూములు వాడివత్తలై నట్టుండటం చూస్తున్న ఆ రైతులకు బాధాకరంగా ఉంది.

"ఈ సంవత్సరం పాడు కరువే వచ్చేట్టుంది. శ్రీరామ్‌సాగర్ నీళ్ళు విడిచినప్పట్నుంచి మీ చెరువెండిపోలేదంటరు నిజమేనా...? ఈ సంవత్సరం నీళ్ళు చివరికొచ్చినయి... చేపలు బాగా పడ్తున్నయి."

"ఇరవయేండ్ల కెక్కోనే అయింది చెరువెండిపోక. ఆ చెర్లో బాగానే చేపలు దొరుకుతాయి. అవి సాలనట్టు రవ్ చేపలు తీసుకచ్చి కలుపుతండ్రు... ఆ చేపలు గుత్తకిచ్చిండ్రు... ఇంతకుముందు మంచి మంచి బొమ్మిడాలు దొరికేటియి... పెద్ద పెద్ద వాలుగలచ్చి అన్నిట్ని మింగేత్తున్నయి... మనిషి ఆశెకు, ఆపేక్షకు అంతే లేకుండయిపోతంది సుబ్బారావు...

ఓ దిక్కు శ్రీరామ్‌సాగర్ నీళ్ళొచ్చి చెరువెండి పోతలేదు నిజమే... అయినా, చాలామంది ఎవుసాల విడ్చి పెట్టిపోతున్నరు... వ్యాపార పంటలచ్చి ఎప్పుడూ తినే పంటల్ని మింగేసినయి... ఇప్పుడు మీరు పత్తిపంటల్ని తీసుకచ్చి మా రేగల్లల్ల పండే మక్కలు, పల్లీలు లేకుండ జేత్తున్నరు..."

రాజిరెడ్డి మాటల్లో వాస్తవాలున్నట్టు గ్రహించాడు సుబ్బారావు. "నువ్వన్నది నిజమే రాజిరెడ్డి...! కాని, కాలంతో పాటు మనమూ మారాలి... శ్రీరామ్‌సాగర్ నీల్లు వచ్చిం తర్వాత మీ వ్యవసాయాలు కొంత మెరుగయ్యాయనుకుంటాను..."

ఆ మాటలకు చిన్నగా నవ్వాడు రాజిరెడ్డి. "నువ్విక్కడికచ్చిన కొత్తలో నన్నో మాటడిగినవు గుర్తుందా సుబ్బారావు?... ఇక్కడోలు కూరగాయలెక్కువ తినరని... ఇక్కడెడ్లు ఒంగోలు గిత్తలోలె ఉండయని... ఇప్పుడు నీకు కారణాలర్థమైన నయనుకుంట... ఇక్కడి వ్యవసాయ పరిస్థితులు, దున్నాల్సిన భూములు, దొరికే గడ్డి ఇవన్నీ కారణాలు.

ఇక్కడి రైతు తీరే ఎడ్లుంటయి... ఇక్కడ పొలాలు దున్నినా, చేండ్లు దున్నినా అడుగుకున్న రాల్లతోని నాగలి దుంపలిరుగుతయి. ఎడ్లకు కాళ్ళ కర్లుపడుతయి...

మా దగ్గెర కూరగాయలు పండించడం తక్కువే. కొన్నేండ్లనుంచి పట్టణాల దగ్గెరున్న ఊర్లోల్లు బాగ పండించి అమ్ముకుంటండ్రు... లేనోల్లకు కూరగాయలు వండుకుంటానికవసరమయ్యే నూనెక్కడ దొరుకుతది...? వాళ్ళ పేదరికమే వాళ్ళను కూరగాయలు ఎక్కువ తినకుండ చేసింది.

ఇప్పుడిప్పుడు కొంత తింటున్నా తక్కువే. ఎక్కువగా పప్పు, పులుసు, కారం తింటరు. అప్పుడప్పుడు మాంసం, చేపలు... కూరగాయలు కొనితినడం చాలా తక్కువ" అన్నాడు.

రాజిరెడ్డి జీవితానుభవాలతో చెబుతున్న మాటలు శ్రద్ధగా వింటున్నాడు సుబ్బారావు.

ఇక్కడ శ్రీరామ్‌సాగర్ పూడికను తీయడం రాజకీయం చేయడం రాజిరెడ్డి చెబితే, గుంటూరు, ప్రకాశం జిల్లా ప్రాంతాల్లో ప్రత్తి రైతుల ఆత్మహత్యల గురించిన వివరాలు సుబ్బారావు చెప్పాడు.

ఒకరిమాటలొకరు వింటుంటే ఎక్కడైనా చిన్న రైతు పరిస్థితుల్లో పెద్దగా తేడా లేదనిపిస్తుంది వాళ్లకు. రాజిరెడ్డికిదంతా భూమి గొడవగా కనబడటంలేదు... దాని వెనుకున్న శక్తుల గొడవనిపిస్తుంది.

జీవితాలను మథిస్తే వచ్చిన అనుభవాలతో వాళ్ళు మంచి చెడుల గూర్చి మాట్లాడుకుంటూ ఊరి చివరికొచ్చారు... రాజిరెడ్డికి సుబ్బారావిప్పుడు తనలాంటి బక్కరైతే అనిపిస్తున్నాడు.

"సరేగాని సుబ్బారావు... ఈ సంవత్సరం కరువు నెట్ల ఎదుర్కొనుడో తెలుస్తలేదు... పునాస పంట పూర్తిగనే నాశినమైంది. ఈ పంట వరీ పొయినట్టె... ఎక్కడో వానలు పడితే మనకేం లాభం...? వానకాలం చివరికచ్చె... వేసంగి పంట పండుతదన్న నమ్మకంగూడ లేదు... ఈ ఏడెట్లెల్లుతదో...?"

రాజిరెడ్డి మాటలకు బొలబొలా నవ్వాడు సుబ్బారావు. కొద్దిగాగిన తర్వాత "మంచుద్యోగంలున్న కొడుకున్నడుగద...! నీకింత కష్టమెందుకు...? ఈ వ్యవసాయం చేయడమెందుకు...? నువ్వు కష్టపడి చదివించలేదా...? కొడుకునడుగు పోయి... లేకుంటె అన్ని బందుజేసి కొడుకు దగ్గెర్నే ఉండలేవు..." అన్నాడు సుబ్బారావు.

'నీకేంది మారాజువు... పెద్ద నోకరున్న కొడుకు... ఏం రంది నీకు...' తన గూర్చి ఊరివాళ్ళన్న మాటలూ జ్ఞాపకం వచ్చాయి రాజిరెడ్డికి.

తనెంత మారాజో తనకు తెలుసు... తన పేగును బయటేసుకోని ఇతర్ల సానుభూతి పొందడం రాజిరెడ్డి కిష్టంలేదు. కాని, సుబ్బారావన్న మాటలు విన్న తర్వాత కొడుకు దగ్గెరికి పోయి రావాలనిపించింది.

"నేను మారాజునో, తరాజునో కాని, ఓసారి కొడుకు దగ్గరకు పోయత్త... తిండిగింజలు కూడ కొనుక్కోవల్సి వచ్చెటట్టుంది... ఈ పంటంటె పాయెగని చెర్లకు నీళ్లస్తె వేసంగి విత్తునా లేసుటానికి పెట్టుబడులకు పైసల్లేవు..." అలా మాట్లాడుకుంటూ ఎవరింటి దిక్కు వాళ్ళు వెళ్ళిపోయారు సుబ్బారావు, రాజిరెడ్డి.

కొద్దిరోజులు తర్వాత వరంగల్‌లో ఉద్యోగం చేస్తున్న కొడుకు దగ్గిరకెళ్ళాడు రాజిరెడ్డి. మామను చూసి ముఖం చిట్లించింది కోడలు... పూర్వాశ్రమంలో

కాపులయిన ఆ కుటుంబంలో తాను పడాల్సిందే కాదని, కృష్ణారెడ్డి ఇంజినీరవడంవల్ల తనా ఇంటి కోడలుగా వచ్చిందని అనుకుంటుందామె.

భోజనాలవీ అయింతర్వాత కొడుకుతో తానొచ్చిన విషయం ఎత్తాడు రాజిరెడ్డి.

“ఈ సంవత్సరమంత పాపపుకాలం నేనెప్పుడు చూల్లేదు బిడ్డా...! వర్షకాలం నెలల తరబడి ఒక్క చినుకన్న రాలకపోవుడు చూస్తున్నదిప్పుడే... ఈ కరువును తట్టుకునుడు కష్టంగనే ఉంది.”

తండ్రి మాటలు విని చేదుతిన్నట్లు ముఖమదోలా పెట్టాడు కృష్ణారెడ్డి.

“మేమిక్కడ లక్షలకొద్ది రూపాయలేం సంపాయిస్తలేం... ఎంత జీతమచ్చినా ఉప్పుతోని ముప్పయారు కొంటె జీతమేం మిగుల్తది...? బియ్యం గూడ కొనుక్కోవడ్తిమి. కరువత్తె మమ్ములనేం జేయమంటవు మరి...” అంది కోడలు వరలక్ష్మి.

“నేను మిమ్మల్ని బియ్యం తెచ్చుకోవద్దన్ననా బిడ్డ...? ఇంట్ల పండేటి బియ్యం, పప్పులు మిమ్ముల కొనుక్కొమ్మని ఎవ్వలు చెప్పిండ్రు...? మీరు తెచ్చుకో పోతిరి... నేను తెచ్చిచ్చినా వద్దంటిరి... పంట తెచ్చుకుంటె డబ్బులియ్యవలిసత్తదని వద్దంటిరి. మీ డబ్బులు వద్దన్నా, ఇచ్చుడెందుకు తీసుకునుడెందుకని తెచ్చుకోకపోతె నేనేం జెయ్యాలె...?”

“నాన్నా ఆ మాటలన్నెందుకిప్పుడు...? మా చందాన మేం బతుకుతుంటె మమ్మల్నెందుకిబ్బంది పెడతవు...? భూమిని అమ్ముతనంటె వినకపోతివి. నువ్వు డబ్బు పంపకు మేమీ భూమితోనే బతుకతనంటిరి అమ్మ, నువ్వు... ఇప్పుడేమొ నా దగ్గరికొచ్చి నిష్టూరాలు మాట్లాడవడ్తివి... భూమినేనమ్ముతనంటె విప్పుడేమైంది...?”

కృష్ణారెడ్డి మాటలు సూటిగానే తగిలాయి తండ్రికి. “అవు బిడ్డా...! నేను భూమినే నమ్ముకొని బతికినవాన్ని... ఇప్పుడు కూడా అట్లనే బతుకుతున్న కాని, కాలం ఇంత ఘోరంగుంటె ఏం చెయ్యాలో చెప్పు... అందుకే కన్న కొడుకువని నీ దగ్గరికొచ్చిన... తేపతేపకు ఉన్న భూమిని అమ్మి పారెయ్యిమంటవు... భూమినమ్మేస్తె మాత్రం మమ్ములనెట్ల పోషిస్తవు బిడ్డ?...” అన్నాడు రాజిరెడ్డి.

“నాన్నా! నేను బాగా ఆలోచించే భూమిని అమ్ముమంటున్నాను. ఇల్లు వదిలిపెట్టి భూమంతా అమ్ముతే రెండు లక్షలైన వస్తాయి... ఆ డబ్బును బేంకులో వేస్తే కనీసంగా నెలకు రెండున్నర వేలొస్తాయి... వచ్చే వడ్డీలోంచి మీకవసరమున్నంతవరకిస్తాను... అప్పుడిగ పంట పండకున్నా, కరువెంత వచ్చినా మనకేంభయం? మీకు నెలకు ఎక్కువకెక్కువ వెయ్యి రూపాయలు ఖర్చవుతాయి. మీరెంత వ్యవసాయం చేసినా వడ్డీమందమన్న పంట వస్తుందా?”

భూమినమ్మి అందులో కొంత మిగుల్చుకొని తమ ఖర్చులకిస్తానంటున్న కన్నకొడుకు మాటలు హృదయశల్యంగానే వున్నాయి రాజిరెడ్డికి.

“నా తండ్రి, తాతల కాలం నుంచీ ఉంటున్న భూమది. అందులో ఏం పండినా పండకున్నా నాకు భూమంటె కన్నతల్లికంటెక్కువే... దాన్నమ్ముతే తల్లినమ్మినట్టే... నీకెన్నిసార్లు చెప్పినా అదే మాటంటవు...దాన్నమ్ముతే వచ్చే డబ్బు వడ్డీల నుంచి

తప్ప నీ జీతంల నుంచి ఒక్క పైసా ఇవ్వనంటవు. .. నువ్వు పెద్ద ఇంజనీరువు కద బిడ్డా...?"

"భూమట తల్లట... దాన్నమ్ముతె తల్లినమ్మినట్టట... ఇదో సోది..." అంది వరలక్ష్మి.

"నాన్నా! నేను ప్రాక్టికల్‌గా ఆలోచించేవాన్ని. ఆ భూమివల్ల లాభం లేనప్పుడు ఉంచుకోవడం దేనికి...? అదలాగే ఉంచి నేను డబ్బివ్వడం దేనికి?"

"నువ్వు ఇంజనీరువు గద బిడ్డ!... లెక్కలు బాగనే పెడ్తవు... ఆ మిత్తి పైసల్నుంచి మీ అమ్మకు, నాకు సరిపోయేన్ని పైసలు పంపతవు!... లేదా, ఇక్కడుంటె మూడుపూటల బువ్వ పెడుతవు... కాని, మీ చెల్లెల్లుండిరి... మేం బతికున్నమని వాళ్ళొస్తరు గద అప్పుడప్పుడు... ఇంక నా రక్తసంబంధీకులుండిరి... మీ అమ్మవాళ్ళుండిరి... ఊరన్నప్పుడు చుట్టాలు, పక్కాలు ఎందరో ఉండిరి... ఇవ్వన్నిటికి ఖర్చులెట్లమరి...? నువ్వేమొ దూరంగుంటివి..." అన్నాడు కొడుకును చూస్తూ రాజిరెడ్డి.

"నాన్నా! ఇంకా ఇవన్నీ పట్టుకొని వేలాడ్తానంటే ఏమన్నట్టే... అందరికీ పెళ్ళిళ్ళు, పిల్లలు అయిం తర్వాత కూడా ఇంకా ఈ నాన్సెన్సంతా ఏంటి...? ఎవ్వల బతుకు వాళ్ళు బతుకుతున్నారు కదా...! వాళ్ళు రాకుంటేం బోతోంది...? మీరే ఉన్నరా తల్లిదండ్రులు...? చుట్టాలను, బంధువులను చూసే వాళ్ళు ఎవరూ లేరా...?" అన్నాడు కృష్ణారెడ్డి.

"నీ సంపాదనల నుంచి ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా మమ్మల్ని సాదుతనంటవు. మరి మా భూమమ్ముతె వచ్చిన పైసలే ఇంకా మిగుల్తయి కద బిడ్డా...? వాట్నేం జేస్తవు...?"

"అందులో ఏం మిగుల్తయి నాన్నా...! ఏమైనా మిగిలినా మీ కర్మఖర్చులకు వేలకొద్ది ఖర్చువుతాయి కదా...!" కొడుకు మాటలు విన్న రాజిరెడ్డి కళ్ళవెంట పటపటా నీళ్ళు కారాయి.

పంచెతో కళ్ళను తుడుచుకున్నాడు.

"అంటే, ఏ ఆధారమూ లేకుంటె కర్మగూడ చేసేటోల్లు కాదన్నమాట..."

"లేనిపోని యెందుకూహించుకుంటవు నాన్నా...! నేను మంచివాన్ని కాబట్టి ఊర్కుంటున్నాను... నా స్థానంలో ఇంకెవరున్నా ఆ భూములన్నీ ఎప్పుడో అమ్మి డబ్బులు తీసుకునేవారు..."

"అవుబిడ్డ... నువ్వు మంచోనివే..." అని ఊర్కున్నాడు రాజిరెడ్డి.

"ఈ కారెడ్డాలన్నెందుకు గాని ఆ భూమమ్ముతె అమ్ము... లేదా దానిమీద బతుకు. కరువచ్చిందని మమ్ముల చంపకు..."

తానెన్ని చెప్పినా కొడుకు వినడని రాజిరెడ్డి కర్థమైంది. కొడుకెన్ని చెప్పినా ప్రాణానికి ప్రాణమైన నేల నమ్మదలుచుకోలేదు రాజిరెడ్డి. అతికష్టంగా ఆ రోజుండి తెల్లవారి బయల్దేరాడు రాజిరెడ్డి.

బస్సులో కూర్చున్నాడు. కొడుకు, కోడలు మాటలు విన్న తర్వాత రాజిరెడ్డికి వర్షాభావంవల్ల, పంటలు పండకపోవడంవల్ల వచ్చిన కరువు కరువులా కనబడటం లేదు...నిన్న కొడుకింట్లో తాననుభవించిన 'కరువు' ముందు ఈ కరువు చాలా చిన్నదిగా కనబడుతుంది... ఆ కరువుకు ఎన్నో రెట్లెక్కువైన భయంకరమైన 'కరువు' పొంచివున్నట్టనిపిస్తుందతనికి.

'ఇప్పుడొచ్చిన కరువు భరించరానిదే... అయితే, ఇలాంటి కరువులు తమకు కొత్తవేం కావు...

మంచిగా వర్షాలు పడితే, మంచి పంటలు పండితే, పండిన పంటకు ధరొస్తే ఇలాంటి కరువులకు పరిష్కారం లభిస్తుంది...

కాని, మానవతా విలువలకు, మానవ సంబంధాలకు కరువొచ్చింది... ఆ కరువునెలా భరించడం...? ఆ కరువుకు నివారణామార్గాలేవి...?' తనలో తాను గొణుక్కుంటూనే ఉన్నాడు రాజిరెడ్డి.

● 'స్వాతి' సపరివారపత్రిక కథల పోటీలలో
మొదటి బహుమతి పొందిన కథ – 30–1–98 ●

★ ★ ★